03-11-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

**"మధురమైన పిల్లలూ - ఈ అనాది ఆట తయారుచేయబడి ఉంది, ఇందులో ప్రతి ఒక్క పాత్రధారి పాత్ర ఎవరిది వారిదే, ఒకరి పాత్ర మరొకరితో కలవదు, ఇది కూడా ప్రకృతి సిద్ధమే"**

ప్రశ్న:- భక్తి మార్గంలో గంగా జలానికి అంతటి గౌరవమును ఎందుకు ఇస్తారు? భక్తులకు గంగా జలం పట్ల అంతటి ప్రీతి ఎందుకు ఉంది?

జవాబు:- ఎందుకంటే పిల్లలైన మీరు ఇప్పుడు జ్ఞాన జలము (అమృతము) ద్వారా సద్గతిని పొందుతారు, మీ ప్రీతి జ్ఞానం పట్ల ఉంది, దాని ద్వారా మీరు జ్ఞాన గంగలుగా అవుతారు, అందుకే భక్తులు నీటికి అంతటి గౌరవాన్ని ఇచ్చారు. వైష్ణవులు ఎప్పుడూ గంగా జలాన్నే ఉపయోగిస్తారు. కానీ నీటి ద్వారా సద్గతి ఏమీ లభించదు. సద్గతి జ్ఞానము ద్వారానే లభిస్తుంది. జ్ఞానసాగరుడైన తండ్రి మీకు సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇస్తారు. ఆత్మను పావనంగా తయారుచేసే సాధనము నీరు కాదు, దాని కోసము జ్ఞాన-యోగాల ఇంజెక్షన్ కావాలి, అది ఒక్క తండ్రి వద్ద మాత్రమే ఉంది.

గీతము:- అదృష్టాన్ని మేల్కొలుపుకుని వచ్చాను... (తక్దీర్ జగాకర్ ఆయీ హూ...)

ఓంశాంతి. ఇది జ్ఞాన మార్గమని, దీని ద్వారా సద్గతి లభిస్తుందని లేక స్వర్గ రాజ్య భాగ్యము లభిస్తుందని మధురాతి-మధురమైన పిల్లలకు తెలుసు, అందుకే దీనిని పాఠశాల అనండి లేక కాలేజి అనండి, యూనివర్సిటీ అనండి, విషయం ఒక్కటే. యూనివర్సిటీలో ఉన్నత విద్య, మిగిలినవాటిలో ప్రాథమిక విద్య లభిస్తుంది. వాస్తవానికి అన్నీ పాఠశాలలే, పాఠశాలల్లో సంపాదన కోసం చదువుకుంటారు. ఇది మన గుప్తమైన చదువు అని పిల్లలైన మీకు తెలుసు. అనంతమైన తండ్రి వచ్చి ఆత్మలను చదివిస్తారు. ఆత్మలే చదువుకుంటాయి. ఒకవేళ శ్రీకృష్ణుడు భగవంతుడైతే మీ బుద్ధి యోగము అతని చిత్రము వైపుకు వెళ్తుంది, అతని వైపే ఆకర్షణ కలుగుతుంది. అతని చిత్రం లేకుండా మీరు ఉండలేకపోతారు. కానీ శ్రీకృష్ణుడు భగవంతుడు కారు. అలా తప్పుగా అర్థం చేసుకున్న కారణముగా మనుష్యులకు శ్రీకృష్ణుని స్మృతియే ఉంటుంది. దేహపు స్మృతి అయితే చాలా సహజము. ఆత్మిక స్మృతిలో శ్రమ ఉంది. బాబా, ఎలా స్మృతి చేయాలి? ఎవరిని స్మృతి చేయాలి? అని అడుగుతారు. శ్రీకృష్ణుని చిత్రమైతే మధురంగా ఉంటుంది, పరమపిత పరమాత్మ అయితే నిరాకారుడు. వారు స్వయంగా అంటారు, నేను ఈ వృద్ధ శరీరములో కూర్చుని పిల్లలైన మీకు మళ్ళీ సహజ రాజయోగాన్ని మరియు జ్ఞానాన్ని నేర్పిస్తాను. వాస్తవానికి ఇది చాలా సహజమైనది, కేవలం బాబానే స్మృతి చేయాలి. శివబాబాను స్మృతి అయితే చేస్తారు కదా. బెనారస్ లో శివకాశి అని అంటారు, ఆ తర్వాత విశ్వనాథ గంగ అని అంటారు. విశ్వనాథుడు గంగను తీసుకుని వచ్చారు. ఇప్పుడిది నీటి గంగ యొక్క విషయమైతే కాదు. జ్ఞాన సాగరుడు ఈ జ్ఞాన గంగలను తీసుకువచ్చారు. కావున జ్ఞాన గంగలకు తప్పకుండా జ్ఞానాన్ని ఇచ్చే జ్ఞానసాగరుడైన తండ్రి స్మృతి ఉండాలి. ఓ జ్ఞాన గంగలూ, ఒకవేళ మీరు స్వయాన్ని జ్ఞాన గంగగా భావిస్తున్నట్లయితే జ్ఞానసాగరుడిని స్మృతి చేయండి. ఎవరైతే స్వయాన్ని జ్ఞాన గంగగా భావించరో, వారు అజ్ఞాని అయినట్లు. మనకు జ్ఞానసాగరుడు సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇచ్చారని పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు మనం మళ్ళీ అందరికీ జ్ఞానామృతాన్ని ఇవ్వాలి. అయితే కొందరు దోసిలి అంత తీసుకుంటారు, కొందరు లోటా అంత నింపుకుంటారు. వైష్ణవులు ఎవరైతే ఉంటారో, వారికి గంగా జలం పట్ల ఎంతో ప్రీతి ఉంటుంది. వారు ఎప్పుడూ గంగా జలాన్నే ఉపయోగిస్తారు. అలాగే మీకు ఈ జ్ఞానం పట్ల ప్రీతి ఉంది ఎందుకంటే ఈ జ్ఞానం ద్వారా మీరు సద్గతిని పొందుతారు. ఆత్మ అయిన మీరు తండ్రినైన నన్ను స్మృతి చేయండి అన్న ఈ జ్ఞానాన్ని శివబాబా ఇచ్చారు. వారసత్వాన్ని కూడా మీరు తెలుసుకున్నారు. ఇది ఎవరు అర్థం చేయిస్తారు? పరమపిత పరమాత్మ. పరమాత్మ నుండి వారసత్వం ఎలా లభిస్తుంది అని ఎప్పుడూ స్వప్నములో కూడా ఎవరికీ ఈ ఆలోచన రాదు. పరమపిత పరమాత్మ లేకుండా ఈ అనంతమైన వారసత్వం లభించజాలదు. పరమపిత అనగా మనుష్యమాత్రులందరి రచయిత. కావున వారు రచనకు తండ్రి అయినట్లు కదా. కేవలం నిరాకారుడినే పరమపిత పరమాత్మ అని అనడం జరుగుతుంది, వారిని ఈ నేత్రాలతో చూడలేరు. భక్తి మార్గంలో దివ్య దృష్టితో చూడడం జరుగుతుంది. ఇక్కడ కూడా మీరు ఆత్మ సాక్షాత్కారాన్ని పొందలేదు, అయినా స్వయాన్ని ఆత్మగా నిశ్చయం చేసుకుంటారు. ఆత్మ అవినాశీ అని మీకు తెలుసు. ఆత్మ వెళ్ళిపోతే శరీరానికి ఏ విలువా ఉండదు. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుంటుందని అందరికీ తెలుసు. కానీ ఆత్మ అంటే ఏమిటి, ఇది ఎవరికీ తెలియదు. ఆత్మ బిందువు వలె అతి సూక్ష్మాతి సూక్ష్మమైనది, అది భృకుటి మధ్యలో నివసిస్తుంది. చాలా చిన్నని

ఆత్మ, అదే అంతా చేస్తుంది. ఆత్మ లేకపోతే ఈ కర్మేంద్రియాలు కూడా పని చేయవు. ఆత్మ ఒక శరీరాన్ని విడిచి మరొకటి తీసుకుని తన పాత్రను అభినయిస్తుంది. ప్రతి ఒక్కరి పాత్ర ఎవరిది వారిది. ఒకరిది మరొకరితో కలవదు. పాత్రధారులు ఎప్పుడూ ఒకేలా ఉండరు. ఈ ఆటను ఎవరూ అర్థం చేసుకోలేరు. ప్రతి ఆత్మకూ తమ-తమ పాత్ర ఉంది. ఆత్మలన్నీ ఒకే రూపము కలిగినవి. ఇకపోతే శరీరాలు వేరు-వేరుగా ఉంటాయి. ఈ అనాది ఆట తయారై ఉంది. ఈ విషయాలను విశాలబుద్ధి కలవారే అర్థం చేసుకోగలరు. ఆత్మ బిందువు వలె ఉంటుందని, అందులో 84 జన్మల పాత్ర అవినాశీగా నిశ్చితమై ఉందని, ఆ పాత్ర ఎప్పుడూ వినాశనమవ్వదని ఆశ్చర్యపోవాలి, దీనినే ప్రకృతి సిద్ధము అని అంటారు. నేను ఒక శరీరాన్ని వదిలి మరొక పాత్రను అభినయిస్తాను అని ఆత్మ స్వయంగా అంటుంది. మనం సాక్షీగా అయి మొత్తం సృష్టిలోని పాత్రధారులందరి పాత్రను చూస్తాము. మనం పరమపిత పరమాత్మ నుండి మన 21 జన్మల సుఖపు వారసత్వాన్ని మళ్ళీ తీసుకుంటున్నాము, వారి కోసము మనం 2500 సంవత్సరాలు (అర్ధకల్పము) భక్తి చేసాము. కావున తప్పకుండా భక్తులకు భగవంతుడు లభించవలసిందే. నంబర్ వన్ భక్తులు, పూజారులు మీరేనని ఇప్పుడు మీకు తెలిసింది. ఈ డ్రామాలో మొట్టమొదట సత్యయుగములో మీరు దేవీ-దేవతల పాత్రను అభినయించేందుకు వస్తారు. ఈ సమయంలో మీరు బ్రాహ్మణ వర్ణములో ఉన్నారు. ఆత్మలమైన మనము బ్రహ్మ ముఖవంశావళి బ్రాహ్మణ ధర్మానికి చెందినవారము. మేము బ్రాహ్మణ ధర్మము నుండి మారి దైవీ ధర్మములోకి వెళ్ళాలి అని ఇప్పుడు చదువుకుంటారు. ఆత్మకు జ్ఞానము లభించింది. జ్ఞానము ద్వారా సద్గతి లభిస్తుంది. సద్గతి లభించవలసి ఉన్నప్పుడు అది అందరికీ లభిస్తుంది. తండ్రి అంటారు, నేనే సర్వుల సద్గతిదాతను. మనుష్యులు ఎప్పుడూ గురువులు కాలేరు. ఎల్లప్పుడూ దేహీ-అభిమానులుగా ఉండాలి. ఒకవేళ ఎవరికైనా కొడుకు ఉన్నారనుకోండి, అతను కర్మల లెక్కాచారము అనుసారముగా కొడుకుగా అయ్యారు అని భావించాలి, ఒకవేళ అతను మరణిస్తే ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకుంటారు, లెక్కాచారము అంతే ఉంది, అది పూర్తి చేసాడు, ఇందులో బాధపడవలసిన లేక ఏడ్వవలసిన విషయమే లేదు. సాక్షీగా అయి ఆటను చూడాలి.

మనం 84 జన్మలు తీసుకుంటామని పిల్లలైన మీకు తెలుసు. సత్యయుగములో మనం దేవీ-దేవతలుగా ఉండేవారము. ఇంతకుముందు మీకు ఏమీ తెలిసేది కాదు. బ్రహ్మ కూడా ఎంతోమంది గురువులను ఆశ్రయించారు కానీ వారికి కూడా ఏమీ తెలిసేది కాదు. 84 లక్షల జన్మలు ఉంటాయని భావించేవారు. ఇప్పుడు మీరు అలా అనరు. తండ్రి అర్థం చేయిస్తున్నారు, మధురాతి మధురమైన, చాలా కాలం దూరమై తర్వాత కలిసిన పిల్లలూ - నేనే వచ్చి అందరి సద్గతిని చేస్తాను. అన్ని ధర్మాలలోని భక్తులు భగవంతుడిని ఏదో ఒక విధముగా తప్పకుండా తలచుకుంటారు. ఓ గాడ్ ఫాదర్, హే పరమపిత పరమాత్మా... అని అంటారు కానీ పరమాత్మ గురించి తెలియదు. కేవలం పరమపిత పరమాత్మ పరంధామంలో ఉంటారని భావిస్తారు. కానీ మనం అక్కడికి ఎలా వెళ్ళాలి, మనమైతే వెళ్ళలేము. సత్యయుగ దేవతలు కూడా వెళ్ళలేరు, వారు 84 జన్మలు తీసుకోవలసి ఉంటుంది. అక్కడ సుఖము ఉంటుంది, అక్కడ ఉన్నప్పుడు ఎక్కడికైనా వెళ్ళాలి అన్న ఆలోచన కూడా రాదు. తండ్రిని కూడా స్మృతి చేయరు. దుఃఖములో అందరూ భగవంతుడిని తలచుకుంటారు... అని అంటారు. తండ్రి అర్థం చేయిస్తారు, నేను మిమ్మల్ని స్వర్గానికి యజమానులుగా చేస్తాను. అక్కడ మీరు సదా సుఖంగా ఉంటారు. కల్పానికి లక్షల సంవత్సరాల ఆయువును చూపించారు, ఇది పొరపాటు. భక్తిలో గందరగోళం చాలా ఉంది. ప్రతి ముంగిట ఎదురుదెబ్బలు తినడము, జప-తపాదులు, తీర్థ యాత్రలు మొదలైనవి చేయడము, ఇదంతా భక్తి మార్గము. అర్ధకల్పం భక్తి మార్గము కొనసాగుతుంది, ఇది కూడా ఒక ఆటగా తయారై ఉంది. తండ్రి అంటారు, పిల్లలందరూ డ్రామాకు వశమై ఉన్నారు. నేను కూడా క్రియేటర్ ను, డైరెక్టర్ ను, చేసేవాడిని, చేయించేవాడిని, కానీ నేను కూడా డ్రామాకు వశమై ఉన్నాను. ఒకే సారి, ఒకే శరీరంలోకి తప్ప ఇంకే శరీరంలోకి నేను రాలేను. ఎల్లప్పుడూ ఈ దాదా తనువులోకే వస్తారా మరియు వీరినే బ్రహ్మగా చేస్తారా? అని అంటారు. అవును, మొట్టమొదట వీరి జన్మయే లక్ష్మీ-నారాయణులుగా ఉండేది కదా, కావున మళ్ళీ వీరినే ఆదిదేవునిగా, ఆదిదేవిగా చేస్తాను. ఈ దిల్వాడా మందిరంలో శివుని చిత్రము కూడా ఉంది. ఆదిదేవుడు, ఆదిదేవి కూడా ఉన్నారు, పిల్లలు కూడా ఉన్నారు. అందరూ తపస్యలో కూర్చున్నారు. పైన స్వర్గము కూడా ఉంది, పూర్తి స్మృతి చిహ్నము నిలబడి ఉంది. మీరు ఇక్కడ కూర్చుని-కూర్చునే దైవీ వృక్ష స్థాపనను చేస్తున్నారు. అవి జడ చిత్రాలు. ఇక్కడ మీరు చైతన్యముగా కూర్చున్నారు. మీరు శ్రీమతంపై స్వర్గ స్థాపనను చేస్తున్నారు. ఎవరైతే బాగా చదువుతారో మరియు చదివిస్తారో, వారు ఉన్నత పదవిని పొందుతారు. లక్ష్మీ-నారాయణులు ఏ పురుషార్థము చేసి ఉంటారు. మీరు కూడా, మళ్ళీ దేవతలుగా అవ్వాలని పురుషార్థం చేస్తున్నారు కావున తప్పకుండా దేవతలు తమ పూర్వ జన్మలో పురుషార్థం చేసి ఉంటారు. మనుష్యులు మృత్యులోకంలో ఉంటారు, దేవతలు అమరలోకంలో ఉంటారు. భారత్ అమరలోకంగా ఉండేది, మళ్ళీ మృత్యులోకంగా అయింది. ఇప్పుడు ఇది సంగమము, దీనిని కుంభ మేళా అని అంటారు. ఇదే సత్యాతి-సత్యమైన

కుంభ మేళ. ఆత్మ, పరమాత్మ కలుసుకుంటారు. అనేక సార్లు కలుసుకుని ఉంటారు, ఇంకా అనేక సార్లు కలుసుకోనున్నారు. కొందరు పురుషార్థం చేసి పూర్తి వారసత్వము తీసుకుంటారు. కొందరు తిరిగి వెళ్ళిపోతారు. (దీపపు పురుగుల ఉదాహరణ). రావడమైతే ఎందరో వస్తారు. వీరు మన బాప్ దాదా అని పిల్లలైన మీకు నిశ్చయముంది. మనం బ్రహ్మాకుమార-కుమారీలము. బ్రహ్మ కూడా శివుని యొక్క పుత్రుడు. మనం దత్తత తీసుకోబడిన పిల్లలము. అందరూ తండ్రి పిల్లలుగానే పిలవబడతారు. కానీ బి.కె.లుగా పిలవబడే మనము శివ వంశీ బ్రహ్మాకుమార-కుమారీలము అవుతాము. శివబాబా తాతగారు, వారికి ముఖ్యమైన కొడుకు ఒక్కరు, ఆ ఒక్కరి నుండి మళ్ళీ అనేకులు జన్మిస్తారు.

బ్రహ్మ ముఖవంశావళి అయిన మనం ఎందరమో ఉన్నామని మనకు తెలుసు. అలా ఎంతో మందిగా అవుతూ ఉంటాము, చదివించేవారు శివబాబా. బ్రహ్మ ఆత్మ కూడా నన్ను స్మృతి చేస్తుంది, మీరు కూడా నన్ను స్మృతి చేయాలి. సృష్టి చక్రాన్ని స్మృతి చేసినట్లయితే చక్రవర్తీ రాజులుగా అవుతారు. ఇప్పుడు మీరు స్వదర్శన చక్రధారులుగా అవుతారు. మీలో కూడా నంబరువారుగా దీనిని స్మరిస్తారు. స్మరిస్తూ-స్మరిస్తూ జీవన్ముక్తిని పొందండి అని గానం చేస్తారు కదా, అక్కడ దుఃఖము ఉండదు. ఇది పాత ప్రపంచము. ఈ శరీరం కూడా పాత చెప్పు. ఘడియ-ఘడియ కుట్లు పడుతూ ఉంటాయి. సర్పం ఉదాహరణను ఇస్తారు కదా. అది పాత కుబుసాన్ని వదిలి కొత్తది తీసుకుంటుంది. కొత్త చర్మం మెరుస్తూ ఉంటుంది. మీ ఈ 84 జన్మల పాత చర్మము పూర్తిగా శిథిలావస్థలో, తమోప్రధానంగా ఉంది. ఇప్పుడు మీ ఆత్మ మరియు శరీరము, రెండూ సతోప్రధానంగా ఎలా అవుతాయి, ఇది తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. మధురాతి-మధురమైన పిల్లలూ, నన్నొక్కరినే స్మృతి చేయండి. ఈ స్మృతి రూపీ అగ్ని ద్వారా మీలో ఏ మాలిన్యమైతే చేరిందో, అది కాలి భస్మమైపోతుంది. మీ ఆత్మ సతోప్రధానంగా అవుతుంది. అప్పుడు ఈ పాత శరీరాన్ని వదిలి ఆత్మ వెళ్ళి మరొక శరీరాన్ని తీసుకుంటుంది. తండ్రి స్మృతి ద్వారానే వికర్మలు వినాశనమవుతాయి. భక్తి మార్గంలో కూడా స్మరణ చేస్తారు కదా. నామ జపం చేస్తారు. పూజలు చేస్తారు. విగ్రహాలకు స్నానాలు మొదలైనవి చేయిస్తారు. ఇక్కడ శివబాబాకు స్నానము మొదలైనవి చేయించవలసిన అవసరం లేదు. వారు అశరీరి. శివుని మందిరంలో ఎప్పుడైనా శివునికి వస్త్రాలు మొదలైనవి ధరింపజేసి అలంకరిస్తారా? శ్రీకృష్ణుడిని, లక్ష్మీ-నారాయణులు మొదలైనవారినైతే ఎంతగా అలంకరిస్తారు. నిరాకారునికి ఏం అలంకరణ చేస్తారు! కావున తండ్రి అంటారు, మీరు నిరాకార శివుడినైన నన్ను ఎందుకు పూజించేవారు? తప్పకుండా నేనేదో చేసి వెళ్ళాను, అందుకే మీరు నాకు పూజ మొదలైనవి చేస్తారు. ఆత్మలైన మీరూ నిరాకారీ - నేనూ నిరాకారుడినే. మీరు పునర్జన్మలు తీసుకుంటారు, నేను పునర్జన్మలు తీసుకోను. నేను వచ్చి మీకు స్వర్గం యొక్క, 21 జన్మల వారసత్వాన్ని ఇస్తాను. సన్యాసులు మొదలైనవారైతే ఇళ్ళూ-వాకిళ్ళను వదిలి వెళ్తారు. మీరు ఏదీ వదలవలసిన అవసరం లేదు. కేవలం ఈ అంతిమ జన్మ పవిత్రంగా అయి తండ్రిని స్మృతి చేయండి, అంతే. స్మృతి ద్వారానే మీ ఆత్మ కాంచనంగా అవుతుంది. ఆత్మను లోహము నుండి బంగారముగా పారసనాథుడే తయారుచేస్తారు.

మీరే సత్యాతి-సత్యమైన సంపాదనను చేస్తారు. ఆ అసత్యమైన సంపాదనను కూడా చేస్తూ ఉండండి, దానితో పాటు ఇది కూడా చేయండి. ఏ పాపము చేయకూడదు. సర్జన్ అయితే ఒక్కరే. ప్రతి ఒక్కరి కర్మల లెక్కాచారము యొక్క రోగము ఎవరిది వారిదే. తండ్రిని అడిగినట్లయితే - ఇలా ఇలా చేయండి అని వెంటనే చెప్తారు. ఒక్క తండ్రియే కర్మాతీత అవస్థలోకి తీసుకువెళ్ళేవారు. ఇది అవినాశీ సర్జన్ యొక్క సలహా. ప్రతి ఒక్కరికి ఏయే బంధనాలు అయితే ఉన్నాయో, వాటి అనుసారంగా వచ్చి అడగండి. కుమార్తెలైతే తమ పతికి భూ-భూ చేసి తమతో పాటు తీసుకువస్తారు. పవిత్రంగా అవ్వకుండా స్వర్గంలోకి వెళ్ళలేము అని వారికి అర్థం చేయిస్తారు. అందరూ మరణించవలసిందే. ఇది కూడా అర్థం చేసుకోవలసిన విషయము. ఇది మృత్యులోకము యొక్క అంతిమము. ఇది సంగమము. అమరలోకము యొక్క స్థాపన జరుగుతుంది. ఇప్పుడు మనం తండ్రికి చెందినవారిగా అయి అనగా బ్రాహ్మణులుగా అయి మళ్ళీ దేవతలుగా అవుతాము. ఆ తర్వాత క్షత్రియ, వైశ్య, శూద్రులుగా అవుతాము. ఈ మంత్రము ఎంత బాగుంది, అయినా కూడా మీరు మర్చిపోతారు. యోగంలో ఉండకపోతే 63 జన్మల పాపాల భారము ఏదైతే శిరస్సుపై ఉందో, అది ఎలా భస్మమవుతుంది. గంగా నీరుతో పాపాలేమైనా కడగబడతాయా. పాపాలు ఆత్మకు అంటుకుని ఉన్నాయి. పాపాత్మ, పుణ్యాత్మ అని అంటారు కదా. కావున ఆత్మలైన మీకు పావనంగా తయారుచేసే ఇంజెక్షన్ కావాలి. ఆ ఇంజెక్షన్ పతిత పావనుడైన తండ్రి వద్దనే ఉంది, ఇంకెవ్వరి వద్దా ఈ ఇంజెక్షన్ లేదు, అందుకే అందరూ పిలుస్తారు - ఓ పతిత పావనా రండి, వచ్చి పతితులైన మాకు జ్ఞాన ఇంజెక్షన్ ఇవ్వండి, అప్పుడు మేము పావనంగా అవుతాము అని. ఇప్పుడు పిల్లలు యాత్రపై నడవాలి కదా. లేస్తూ-కూర్చుంటూ ఎల్లప్పుడూ యాత్రలో ఉండండి. తండ్రిని మరియు ఇంటిని స్మృతి

చేస్తే సంపాదన జమ అవుతూ ఉంటుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సాక్షీగా అయి ప్రతి పాత్రధారి పాత్రను చూడాలి. తండ్రి నుండి 21 జన్మల వారసత్వాన్ని తీసుకునేందుకు పూర్తి పురుషార్థం చేయాలి.

2. ఆత్మను సత్యమైన బంగారంగా చేసుకునేందుకు ఈ అంతిమ జన్మలో పవిత్రంగా అయి బాబాను స్మృతి చేయాలి. సత్యమైన సంపాదన చేసుకోవాలి.

వరదానము:- దాతగా అయి తరగని ఖజానాలను దానం చేసే మహాదాని మరియు విశ్వ సేవాధారి భవ

సదా గుర్తుంచుకోండి - తండ్రి ద్వారా ఏవైతే తరగని ఖజానాలు లభించాయో, వాటిని ఇవ్వాల్సిందే. ఖజానాలను కార్యములో ఉపయోగించండి. మనసా ద్వారా గాని, వాచా ద్వారా గాని, సంబంధ-సంపర్కము ద్వారా గాని సఫలం చేసుకుంటూ వెళ్ళండి, దాత పిల్లలు ఒక్క రోజు కూడా ఇవ్వకుండా ఉండలేరు. విశ్వ సేవాధారి ప్రతి రోజు సేవ చేయాల్సిందే. ఒకవేళ వాచాకు అవకాశం లభించకపోతే మనసా చేయండి, మనసా చేయలేకపోతే తమ కర్మలు లేక ప్రాక్టికల్ జీవితం ద్వారా చేయండి. ఎంతగా మీరు మనసా ద్వారా, వాణి ద్వారా స్వయము శ్యాంపుల్ గా అవుతారో, ఆ శ్యాంపుల్ ను చూసి స్వతహాగా అందరూ ఆకర్షితులవుతారు.

స్లోగన్:- ఎవరి వద్దనైతే దృఢతా శక్తి ఉందో, వారి కొరకు అసంభవము కూడా సంభవము అవుతుంది.